క్లుప్తంగా

శివరాత్రి ఉత్సవాల పనులు ప్రారంభం

తెనాలిటౌన్: గంగానమ్మ పేటలోని పర్వత వర్ధని సమేత శ్రీ రామేశ్వరస్వామి వారి దేవస్థానం (పాత శివాలయం)లో శివరాత్రి ఉత్సవాల నిర్వహణ పనులు ప్రారంభించారు. ఫిబ్రవరి 18న స్వామివారి కల్యాణ మహోత్సవం సందర్భంగా.. గురువారం ఆలయ ఆవరణలో ముత్తైదువులు పసుపు కొమ్ములు దంచారు. ఉత్సవాలకు సంబంధించి తాగునీటి వసతి, క్యూలైన్ల ఏర్పాట్లు తదితర పనులను చేపట్టారు. ఆలయ కార్యనిర్వహణాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి రథసప్తమి మహోత్సవాలు

తెనాలిటౌన్: గంగానమ్మ పేటలోని శ్రీ విద్యాపీఠంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు రథ సప్తమి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సాలీగ్రామ మఠం ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య గురువారం తెలిపారు. పూజ్యశ్రీ బాలస్వామిజీ ఆధ్వర్యంలో జరిగే రథ సప్తమి మహోత్సవాల్లో ప్రతి రోజు సూర్య నమస్కారాలు, సూర్య యంత్ర ఆరాధన, ప్రదక్షిణలు, అభిషేకం, మంత్ర పుష్పం కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ప్రతి రోజు ఉదయం 11.45 గంటలకు జప తీర్థం ప్రసాదాన్ని బాల స్వామిజీ అందిస్తారని చెప్పారు. పూజ చేయించుకునే వారు గోత్ర నామాలు నమోదు చేయించుకోవాలని కోరారు.

మృదంగ విద్వాంసుడు సాంబ శివరావుకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్ర చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం బండ రాముడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రముఖ మృదంగ విద్వాంసుడు బెజ్జంకి సాంబ శివరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెలగపూడి సత్యనారాయణ, కనగాల శ్రీనివాసరావు, వెలగా ఆదినారాయణ, దాసరి సత్యనారాయణ, పెనుమూడి సాంబశివరావు, జాస్తి సూర్య, యలవర్తి శ్రీనివాసరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమవరపు సాంబశివరావు, దేవరపల్లి భవాని, ఎన్‌టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటించుకుని వివాహిత ఆత్మహత్యాయత్నం

తెనాలిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత డీజిల్ పోసుకుని నిప్పంటించుకుని గురువారం ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు, బాధితురాలి కథనం మేరకు.. తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన మత్తే గంగాభవాని.. భర్త శ్రీనివాసరావుకు మధ్య కొన్నేళ్లుగా మనస్పర్థలున్నాయి. భర్త వివాహేతర సంబంధం పెట్టుకుని తనను పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపిస్తూ వస్తోంది. తరచూ వేధింపులకు గురి చేస్తున్నాడని, ఇటీవల కాలంలో అత్త మామలు కూడా వేధించడం ప్రారంభిచారని వాపోయింది. మన స్థాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసినట్టు తెలిపింది. కాలిన గాయాలతో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. చికిత్స అందించి గుంటూరు వైద్యశాలకు పంపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: గణతంత్ర దినోత్సవం రోజున అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్ఈబీ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. పట్టణంలోని బోస్‌రోడ్డులో మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొన్నారు.

ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేయాలి

- తెనాలిలో గణతంత్ర వేడుకలు
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శివకుమార్
- ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల జెండా వందనం



మున్సిపల్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: రాజ్యాంగ స్ఫూర్తితో అందరూ పనిచేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. జాతీయ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించి, వందనం చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మ గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజ్యాంగ రచనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి మరువరానిదన్నారు. అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. మహనీయుల త్యాగాల స్ఫూర్తితో, వారి ఆశయ సాధన కోసం సీఎం జగన్ ఎంతో కృషిచేస్తున్నారని చెప్పారు. అనంతరం ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, కమిషనర్ ఎం.జశ్వంతరావు, అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, పలువురు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

- గణతంత్ర దినోత్సవాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా శ్రీనివాసరావు, సయ్యద్ బాషా ఆధ్వర్యంలో వహబ్‌చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. అందరికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కుర్రా సుజాత, కఠారి రత్నకుమారి, దుబాయ్‌బాబు, నాయకులు అక్కిదాసు కిరణ్‌కుమార్, కాకిదేవ సహాయం, కఠారి హరీష్, కుక్కల ముక్తేశ్వరరావు, షేక్ మీరావలి, పెసర్లంక రమణ, రవిశంకర్, దానబోయిన భాస్కర్, మునిపల్లి వంశీ, సారథి, చుక్క భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఎమ్మెల్యే శివకుమార్ ఆవిష్కరించారు. ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.
- 15వ వార్డులోని మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు ఎస్.వెంకట్రావు, షేక్ కొజర్, బోడపాటి శివకృష్ణ, వైఎస్సార్‌సీ పీ నాయకులు మామిడిల సుమన్, మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం, వాసిరెడ్డి కల్యాణి, జగదీష్, కాజా, చందు, రాము, ఫణీ, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- సుల్తానాబాద్‌లోని ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగ్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను కరస్పాండెంట్ వై.ఈశ్వర్ ఆవిష్కరించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ తెనాలి సూపర్‌వైజర్ వై.రవికుమార్, నర్సింగ్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.
- జేఎంజే కళాశాలలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను జీవీఆర్ అండ్ ఎస్ ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్ ఆవిష్కరించారు. అందరికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ, అధ్యాపకులు డాక్టర్ కె.నిర్మల జ్యోతి, పి.కీర్తన, వై.రమాదేవి, ఎం.షకీనా తదితరులు పాల్గొన్నారు.
- గణతంత్ర దినోత్సవ వేడుకలను బీసీ సంక్షేమ సంఘం తెనాలి పట్టణ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను మేడిబోయిన గంగాయాదవ్ ఆవిష్కరించారు. కందుల సాంబశివరావు, ఎం.భీష్మ పాములు, కందుల వేణువర్ధన్, బోడపాటి మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.
- గణతంత్ర దినోత్సవ వేడుకలను ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎంహెచ్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను వైఎస్సార్ సీపీ 1వ వార్డు కౌన్సిలర్ గేదెటి సురేంద్ర ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌సీసీ పరేడ్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ రాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.
- బుర్రిపాలెం రోడ్డులోని గుప్తా పీజీ కళాశాల, బస్టాండ్ సమీపంలోని ఎస్ఆర్‌కే కేఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాలలో జాతీయ జెండాను పొట్టి శ్రీరాములు ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ అధ్యక్షుడు సంబూరు వెంకటకృష్ణమూర్తి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ డి.శ్రీనివాసరావు, గోగినేని విజయకృష్ణ, అధ్యాపకులు ఎం.దశరథ రామిరెడ్డి, కేవీ రవికుమార్, పీజీ కళావతి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవిస్తూ స్వేచ్ఛాయుత జీవనం సాగించాలి

– రిపబ్లిక్ డే వేడుకల్లో సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ

తెనాలి: భారత రాజ్యాంగాన్ని ప్రజలంతా గౌరవిస్తూ స్వేచ్ఛాయుత జీవనం సాగించాలని సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేస్తోందని చెప్పారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ అనాథ మృత దేహాలకు అంతిమ సంస్కారాలు చేసిన శ్రీ శివలింగేశ్వరస్వామి భక్తబృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, హెల్పింగ్ సోల్జర్స్ ఇనయతుల్లా, శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకుడు మొవ్వా సత్యనారాయణ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు జెట్టి శివరామకృష్ణ ప్రసాద్‌ను సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ అభినందించారు. ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యాలయ ఏవో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మువ్వన్నెల జెండా రెపరెపలు

తెనాలిరూరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం పాఠశాలలు, ప్రభుత్వ, రాజకీయ పార్టీల కార్యాలయాలతో పాటు, ప్రధాన కూడళ్లలో జాతీయ జెండా రెపరెపలాడింది. 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి టి.రామచంద్రుడు, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అబ్దుల్ షరీఫ్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. శ్రీ సీత, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఇతర న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది, గుమాస్తాలు పాల్గొన్నారు. అలాగే తెనాలి డీఎస్పీ కార్యాలయం, పట్టణ పోలీస్ స్టేషన్లలో.. డీఎస్పీ డాక్టర్ కె. స్రవంతిరాయ్, సీఐలు కె.చంద్రశేఖర్, కె.వెంకట్రావు, యు.శ్రీనివాసులు, కడప శ్రీనివాసరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెనాలి ప్రభుత్వ రైల్వే పోలీసు కార్యాలయం వద్ద జాతీయ జెండాను జీఆర్పీ ఎస్ఐ ఎల్. సరస్వతి ఆవిష్కరించారు. తహసీల్దార్ కె. రవిబాబు జెండాను ఆవిష్కరించారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవాలు

కొల్లిపర: భారత 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ, ఎమ్మార్వో కార్యాలయాల్లో ఎంపీపీ భీమవరపు పద్మావతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీవో పి.శ్రీనివాసులు , తహసీల్దారు జి.నాంచారయ్య గణతంత్ర దినోత్సవం ప్రాముఖ్యత గురించి వివరించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో..

తెనాలిటౌన్: ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో గురువారం ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. కొత్తపేటలోని ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎంపీడీవో ఎల్.విజయలక్ష్మణ్ ఆవిష్కరించారు. ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, కార్యాలయ ఏవో ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

- మార్కెట్‌యార్డు ఆవరణలో జాతీయ పతాకాన్ని యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి జేవీ సుబ్బారావు ఆవిష్కరించారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి ఏడీఏ కె.వెంకట్రావు జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏవో జి.వెంకటనరసయ్య, ఏఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.
- డివిజనల్ విద్యుత్ శాఖ కార్యాలయంలో జాతీయ పతకాన్ని ఈఈ వీవీ చిరంజీవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈ బి.అశోక్‌కుమార్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు. ఐసీడీఎస్ కార్యాలయంలో జాతీయ పతకాన్ని సీడీపీవో డి.గీతాంజలి ఆవిష్కరించారు. సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.
- కొలకలూరులోని జూబ్లీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్పంచ్ చొప్పర ప్రీతి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిస్టర్ లీమా, కరస్పాండెంట్ కరోలినా పాల్గొన్నారు.
- కొలకలూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా తుమ్మల శివశంకర్ జ్ఞాపకార్థం పదోవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ పినపాటి అనిల్, ప్రధానోపాధ్యాయులు ఎస్.శోభాదేవిలు ఎస్-1 పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పెన్నులు బహూకరించారు.
- గాంధీచౌక్‌లో జాతీయ నాయకులు విగ్రహాలకు మహాత్మ ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో యోగాచార్య పి.కుటుంబరావు, వై.కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.
- కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు ఆవిష్కరించారు. సంగంజాగర్లమూడి గ్రామంలో జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎంపీటీసీ సభ్యులు పసుపులేటి వెంకటనరసమ్మ పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చేకూరి శివపార్వతి, జనసేన పార్టీ నాయకులు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలను అందజేసిన సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ



కోర్టుల ప్రాంగణంలో జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న న్యాయమూర్తులు



గాంధీచౌక్‌లో జాతీయ నాయకుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న రామలింగాచారి



సుల్తానాబాద్‌లోని ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగ్ కాలేజీలో..



ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం స్కూల్‌లో..



మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో

పేదలు నివసిస్తున్న ప్రదేశంలోనే కార్పొరేట్ వైద్యం

- వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలతో జగనన్న ప్రభుత్వం
- తెనాలిలో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్ర నూతన భవన ప్రారంభోత్సవంలో మంత్రి విడదల రజిని



తెనాలిలో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి విడదల రజిని. పక్కన ఎమ్మెల్యే శివకుమార్, అధికారులు

తెనాలి: పేద, మధ్యతరగతి ప్రజలకు వారు నివసిస్తున్న ప్రదేశంలోనే కార్పొరేట్ వైద్యసేవలు అందించాలనే గొప్ప ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గుంటూరు జిల్లా తెనాలి సుల్తానాబాద్‌లో రూ.1.10 కోట్ల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం మధ్యాహ్నం మంత్రి విడదల రజిని ప్రారంభించారు. అనంతర సభకు స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షత వహించారు. మంత్రి రజిని తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ..

రాష్ట్రంలోని జిల్లా ఆసుపత్రులు, ఏరియా వైద్యశాలలు, కమ్యూనిటీ సెంటర్లను ఆధునికీకరిస్తూ, గ్రామాల్లో విలేజ్ క్లినిక్స్, పట్టణాల్లో అర్బన్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో 64 వైద్య పరీక్షలు, 175 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి 25 వేల మంది ప్రజలకు ఒక వైద్యశాలను తీసుకొచ్చినందున గతంలోలా జిల్లా ఆసుపత్రి లేదా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు, చిన్న సర్జరీలు కూడా చేస్తారని తెలిపారు. ప్రసవాలు చేసేందుకు తగిన శిక్షణనూ ఇచ్చామన్నారు. మరో వైపు పీహెచ్‌సీ డాక్టరు రోజుకో ప్రాంతానికి వచ్చి వైద్య పరీక్షలు చేస్తూ మందులను ఇస్తున్న ఫ్యామిలీ డాక్టరు విధానం ట్రయల్ రన్‌లో ఉందని గుర్తుచేశారు. ఆసుపత్రికి పోతేనే పట్టించుకోని గత విధానానికి భిన్నంగా ప్రభుత్వ డాక్టర్ గ్రామాలకు వస్తుండటం గొప్ప విషయమన్నారు.

తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం లభించాక గత 75 ఏళ్లలో ఏ రాష్ట్రంలో, ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా మూడున్నరేళ్ల క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన జగనన్న ప్రభుత్వం, విద్య, వైద్యరంగాల్లో అద్భుతమైన సంస్కరణలను తీసుకొచ్చిందన్నారు. పట్టణానికి అయిదు పట్టణ ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేయగా, ప్రస్తుతానికి రెండు పూర్తయ్యాయని, మిగిలినవి రెండు నెలల్లో పూర్తి కాగలవని చెప్పారు. పేదలకు సంక్షేమంతో భరోసాను కల్పిస్తూ మెరుగైన వైద్యాన్ని అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

డీపీఎంఓ డాక్టర్ రత్న మన్మోహన్, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు మాట్లాడారు. వేదికపై డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.అన్నపూర్ణ, డీపీఓ సైమన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, కృష్ణబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కావటి నిర్మల, కౌన్సిలరు రమావత్ కవితాబాయి, యార్డు డైరెక్టర్ బీక్షాలు నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్ ఉన్నారు.

‘సీనియర్ సిటిజన్స్’ 22వ వార్షికోత్సవం



తెనాలిటౌన్: కవిరాజా పార్కులోని వీజీకే భవనంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 22వ వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. సీనియర్ సభ్యులు రావులపల్లి రాజారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వడ్లమూడి ఆర్.బాబు మాట్లాడుతూ.. తన తండ్రి జ్ఞాపకార్థం నిర్మించిన భవనాన్ని సీనియర్ సిటిజన్స్ సద్వినియోగం చేసుకుంటున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మౌలిక సదుపాయాలకు రూ.50వేలు విరాళంగా అందజేశారు. సీనియర్ సిటిజన్స్ తాళ్లూరి శివరామకృష్ణయ్య, ఈఎల్‌వీ అప్పారావును సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మువ్వా సత్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు, కోశాధికారి ఎస్.నాగేంద్రయ్య, సభ్యులు చలమయ్య, హనుమరెడ్డి, ఆదినారాయణ, శరత్, వెంకట్‌నారాయణ పాల్గొన్నారు.

ఆర్మీలో సేవలందించిన వారికి అవార్డులు



తెనాలిటౌన్: స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో గురువారం ఇమెన్స్ పీస్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్మీలో సేవలు అందించిన గోరికపూడి బాబురావు, దేవరకొండ శ్రీనివాసరావుకు ఈఏపీసీ ఇంటర్నేషనల్ అవార్డులను అందజేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సినీ దర్శకుడు దిలీప్‌రాజా, బిషప్ ప్రవీణ్‌వర్మ శాలువాలతో బాబురావును, శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమంలో పినపాటి సురేష్‌బాబు, రెవరెండ్ మైకేల్, జి.భాగ్యరాజు, మణికాంత్ తదితరులు పాల్గొన్నారు.